
ప్రజాశక్తి
బుధవారం 18 డిసెంబర్ 2024



అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - సీతంపేట

అల్పపీడనం నేపథ్యంలో బుధవారం నుంచి (18,19,20) మూడు రోజుల పాటు భారీ వర్ష సూచన ఉన్నందువల్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి పి.శ్రీదేవి తెలిపారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని రైతులు వరి కోతలు నిలిపివేయాలని, కోసిన పనలను కుప్పలుగా వేసుకొని, టార్పాలిన్లతో కప్పి ఉంచాలని సూచించారు. అలాగే నూర్చిన ధాన్యాన్ని గోనె సంచుల్లో భద్రపరుచుకోవాలని చెప్పారు.

మన్యంలో మరణ మృదంగం

ఆగని గిరిజన విద్యార్థుల మరణాలు
కొరవడిన అధికారుల పర్యవేక్షణ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఎన్నో ఆశలు... ఎన్నో కలలతో చదువు కోసం వస్తున్న ఆశ్రమ పాఠశాలల గిరిజన విద్యార్థులు ఏదో ఒక కారణం చేత పదహారేళ్లకే మృత్యుఒడికి చేరుతున్నారు. మండలంలోని దొరజమ్మ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న పత్తిక దినేష్ గిరిజన విద్యార్థి అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. దినేష్ ఊపిరితిత్తుల సమస్యతో బాధపడడంతో రెండు నెలలు కిందట విశాఖ కెజిహెచ్‌కు తీసుకువెళ్లి వైద్యం అందించారు. వ్యాధి ముదరడంతో బతికే అవకాశం లేదని వైద్యులు చెప్పడంతో ఇటీవలే స్వగ్రామైన మంత్రజోల తీసుకువచ్చారు. దినేష్ ఇంటి వద్దనే చనిపోవడం అత్యంత బాధాకరం. చదువుకునే ప్రాయంలో తమ బిడ్డలు అనారోగ్యం బారిన పడి చనిపోవడంతో తల్లిదండ్రుల ఆవేదన వర్ణాతీతం.

ఆగని విద్యార్థుల మరణాలు

గత కొన్నేళ్ల నుంచి ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులకు వైద్య సేవలందకపోవడంతో వ్యాధుల బారిన పడి మృత్యుఒడికి చేరుతున్నారు. అయినా పాలక ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులు నివారణా చర్యలు చేపట్టడంలో శ్రద్ధ వహించడం లేదు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు స్థానికంగా వైద్యమందించే ఆరోగ్య సిబ్బంది లేకపోవడంతో సకాలంలో వైద్యమందక విద్యార్థులు మరణిస్తున్నారని పలుమార్లు గిరిజన సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. విద్యార్థులకు పౌష్టికాహారం అందడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో విద్యార్థుల్లో రక్తహీనత ఎక్కువగా కనిపిస్తుందని గిరిజన విద్యార్థి సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏటా మన్యం జిల్లాలో వందలాది మంది విద్యార్థులు అనారోగ్యానికి గురై ఆస్పత్రుల్లో చేరడం పరిపాటిగా మారుతుంది. ఎంతో ఆసక్తితో చదువుకోడానికి వచ్చిన విద్యార్థులు అనారోగ్యానికి గురికావడంతో ఇటు చదువుకు దూరమవుతున్నారు. మరోవైపు సకాలంలో వైద్యమందక వ్యాధి ముదిరి మృత్యువాతపడుతున్నారు. ప్రతి ఏటా కనీసం ఐదు నుంచి పది వరకు గిరిజన విద్యార్థుల మరణాలు కొనసాగుతూనే ఉన్నాయి. చదువుకోడానికి వచ్చిన విద్యార్థులు ఏదో ఒక కారణం చేత పసిప్రాయంలోనే మృత్యుఒడికి చేరుతూనే ఉన్నారు. విద్యార్థులు మరణించిన సందర్భాల్లో మాత్రమే జిల్లాస్థాయి, ఐటిడిఎ అధికారులు ఆశ్రమ పాఠశాలలను పరిశీలన వరకే పరిమితం కావడం కనిపిస్తోంది.

కొరవడిన పర్యవేక్షణ?

గతంలో నెల రోజుల్లో నాలుగైదు ఆశ్రమ పాఠశాలలను డిడి, పిఒ సైతం అధికారులు సందర్శించే సందర్భాలు ఉండేవి. విద్యార్థుల మరణాలు అరికట్టడం, విద్యార్థుల మరణాలకు గల కారణాలపై విశ్లేషణ చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా కొరవడిందని, దీంతోనే విద్యార్థులు ఏడాది పొడవునా ఏదో ఒకచోట చనిపోతూనే ఉన్నారని గిరిజన సంఘం నాయకులు విమర్శిస్తున్నారు. రక్తహీనత, జ్వరం వంటి లక్షణాలతో విద్యార్థులు మరణిస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. చదువుకునే పసిప్రాయంలో వివిధ వ్యాధులతో అనారోగ్యం బారినపడి నిండు నూరేళ్లు జీవించాల్సిన పసి మొగ్గలు పదహారేళ్లకే మృత్యుడికి చేరుతున్నారు. దీంతో ఆ ఇంట విషాదాన్ని నింపుతున్నారు.

పెరుగుతున్న మరణాలు

ఈ ఏడాది మన్యం జిల్లాలో ఆరుగురు విద్యార్థులు వివిధ కారణాల రీత్యా చనిపోగా, గత ఏడాది ముగ్గురు విద్యార్థులు మరణించారు. పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో 55 ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, సీతంపేట ఐటిడిఎ పరిధిలో 43 ఆశ్రమ పాఠశాలల్లో వేలాదిమంది విద్యార్థులు చదువుతున్నారు. నిత్యం విద్యార్థులు అనారోగ్యంతో బాధపడుతూ సమీపాన ఆసుపత్రులకు వెళ్లడం పరిపాటిగా మారింది.



మృతి చెందిన విద్యార్థి దినేష్

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలకు వైద్యం కోసం వస్తున్న వారిలో ఎక్కువమంది విద్యార్థులు కనిపిస్తున్నారు. వసతి గృహాల్లో ఆరోగ్య సిబ్బంది లేకపోవడంతో విద్యార్థులు వైద్యం కోసం బయట ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘం నాయకులు చెబుతున్నారు.

వైద్య సేవలు మెరుగుపరచాలి

ఆసుపత్రుల్లో వైద్య సేవలు అంతంత మాత్రమే.. జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు మెరుగుపడలేదు. ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతున్న రోగులకు అన్ని రకాలైన వసతులు కల్పించడంలో మాత్రం ప్రాధాన్యత ఇవ్వడం లేదు. దీంతో వైద్యం అందని ద్రాక్ష గానే మిగిలిపోతుంది.

మండంగి రమణ
సిపిఎం నాయకులు

ఆరోగ్య సిబ్బందిని నియమించాలి

మన్యం జిల్లాలో ఐటిడిఎల పరిధిలో గల ఆశ్రమ పాఠశాలల్లో ఆరోగ్య సిబ్బందిని ప్రభుత్వం నియమించాలి. విద్యార్థులకు వైద్యసేవలు అందేలా చూడాలి. అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలి. వారానికోసారి వైద్య శిబిరాలు నిర్వహించాలి.

కోలక అవినాష్
ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

మెట్టుదిగని ప్రభుత్వం..పట్టువీడని గురువులు

నెలరోజులుగా సమ్మెలో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు
తరుముకొస్తున్న టెన్త్, ఇంటర్ పరీక్షలు
సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు డిమాండ్

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్రంలోని పదో తరగతి, ఇంటర్ పరీక్షల షెడ్యూల్‌ను ప్రభుత్వం ప్రకటించింది. మరో మూడు నెలల్లో పబ్లిక్ పరీక్షలను విద్యార్థులు ఎదుర్కొనున్నారు. గత నెలరోజులుగా గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో, కళాశాలల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు సమ్మె చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1600మంది అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు బతుకు సమస్య పరిష్కారానికి పోరాడుతున్నారు. తమ ఉద్యోగాలను డిఎస్సీ నుంచి మినహాయించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. 10 నుంచి 20 ఏళ్లుగా పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల పోస్టులు డిఎస్సీలో కలిపి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది జరిగితే తమ బతుకులు రోడ్డు మీదపడతాయని వారు ఆందోళన చెందుతున్నారు. ఈ ఉద్యోగాలే జీవనాధారమని నమ్ముకుని పనిచేస్తున్న తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నిస్తున్నారు. చాలీచాలని జీతాలతో ఏళ్లతరబడి పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల డిమాండ్లపై ప్రభుత్వం మొండివైఖరి అవలంభిస్తోంది. అంతే కాకుండా గురుకుల పాఠశాలల్లో బోధన కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం ద్వారా వారి పోరాటాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోంది. వారి డిమాండ్లపై ఒక్క మెట్టు కూడా దిగకుండా ప్రభుత్వం బెట్టు చేస్తోంది. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో గల డెప్యుటేషన్‌పై గురుకుల పాఠశాలల్లో, కళాశాలల్లో నియామకానికి ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. మన్యం జిల్లాలోని గిరిజన సంక్షేమ, ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులను డెప్యుటేషన్‌పై సుదూర ప్రాంతాలకు పంపించడంపై ఉపాధ్యాయ సంఘాలు భగ్గుమంటున్నాయి.

విద్యార్థుల చదువులెలా?

రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తాజా విధానం వల్ల గిరిజన విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి కనిపిస్తోంది. అటు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు, ఇటు గురుకుల పాఠశాల విద్యార్థుల చదువులు అటకెక్కిపోయే అవకాశాలు మెండుగా ఉన్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మూడు నెలల్లో పది, ఇంటర్ పరీక్షలు జరుగనున్న నేపథ్యంలో గురుకుల ఉపాధ్యాయుల సమ్మె ప్రభావం వారి చదువులపై పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయుల పోరాటానికి తాము సైతం మద్దతు ఇస్తామని తల్లిదండ్రులు ముందుకొస్తున్నారు. ఆశ్రమ పాఠశాలల్లో గానీ, గురుకుల పాఠశాలల్లో గాని పదోతరగతి సిలబస్ ఇంకా పూర్తి కాని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ మొండివైఖరి కారణంగా గిరిజన విద్యార్థులకు తీరని నష్టం జరుగుతుందని గిరిజన సంఘాలు భావిస్తున్నాయి. గురుకుల ఉపాధ్యాయులు అధ్యాపకుల సమ్మెకు బాసటగా నిలుస్తున్నాయి.

ప్రభుత్వం మొండివైఖరి విడనాడాలి

28వ రోజుకు చేరిన గురుకుల టీచర్ల సమ్మె



సీతంపేటలో బిక్షాటనం చేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు

గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న మొండివైఖరి విడనాడాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన గురుకుల టీచర్ల దీక్ష శిబిరాన్ని సందర్శించిన అనంతరం మాట్లాడుతూ ఒకే దేశం ఒకే ఎలక్షన్ అంటున్న పాలకులు ఒకే రకమైన పని చేస్తున్న వారికి ఒకే రకమైన జీతం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. గిరిజన అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల పోరాటం న్యాయమైందని అన్నారు ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని డిమాండ్ చేశారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ గిరిజన విద్యా రంగాన్ని దృష్టిలో పెట్టుకుని అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయిల సమస్యల పరిస్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు దివాకర్, రమేష్, వెంకట్, చిన్నారావు, మురళి, జ్యోతి, లక్ష్మి, కవిత, తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట: గురుకుల పాఠశాల ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయులు ఐటిడిఎ ముఖద్వారం వద్ద రిలే నిరాహార దీక్షలతో పాటు వినూత్న రీతిలో భిక్షాటన చేశారు. సుమారు నెలరోజులు కావస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోహన్‌రావు, గణేష్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో రామకృష్ణ ప్రతిభ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఇటీవల కృష్ణా జిల్లా గుడివాడలో జరిగిన 44వ రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో అథ్లెటిక్స్ విభాగంలో మన్యం జిల్లా స్పెషల్ పార్టీ కానిస్టేబులు అల్లు రామకృష్ణ మంచి ప్రతిభ కనబర్చారు. ఈ మేరకు ఆయన్ను స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి అభినందించారు. 4వందల మీటర్ల రిలే, 1500మీటర్ల పరుగు, 5కిలోమీటర్ల పరుగు, లాంగ్ జంప్ విభాగాల్లో విజయం సాధించి నాలుగు బంగారు పతకాల్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ వ్యక్తిగత శ్రద్ధతో నిరంతరం సాధన చేస్తూ, రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని నాలుగు బంగారు పతకాల్ని రామకృష్ణ సాధించడం అభినందనీయమన్నారు.

ముమ్ముందు జరగబోయే క్రీడల్లో పాల్గొని విజయం సాధించి రాష్ట్ర, జిల్లాపోలీసు ఖ్యాతిని పెంచాలని ఎస్పీ హితువు పలికారు. అనంతరం మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన రామకృష్ణను ఎఎస్‌పి ఒ.దిలీప్ కిరణ్, ఎఆర్ డిఎస్‌పి థామస్‌రెడ్డి, ఆర్‌ఐలు శ్రీరాములు, నాయుడు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.



రామకృష్ణను అభినందిస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నోడల్ అధికారి రామ్‌గోపాల్

ఆధార్ స్పెషల్ డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - కురుపాం

ఆధార్ స్పెషల్ డ్రైవ్‌ను సచివాలయ సిబ్బంది సద్వినియోగం చేయాలని గ్రామ సచివాలయాల జిల్లా నోడల్ అధికారి బి. రామ్ గోపాల్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిడిఒ జె. ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో ఆధార్ స్పెషల్ డ్రైవ్‌పై సచివాలయ సిబ్బందికి ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికంగా ఆధార్ కార్డు లేకుండా ఉన్నట్లుగా గుర్తించింది. దీంతో పాఠశాలల్లో, అంగన్వాడీ కేంద్రాల్లో, సచివాలయల్లో ఈ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. న్యూ ఎన్రోల్మెంట్ ఆధార్ అప్లికేషన్ ప్రక్రియలను గ్రామ పరిధిలో గల పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ వర్కర్లు, ఐసిడిఎస్ సూపర్వైజర్లతో సమన్వయం చేసుకొని సదరు డిజిటల్ అసిస్టెంట్ మరో సచివాలయం ఉద్యోగిని సహకారం తీసుకొని స్పెషల్ డ్రైవ్ ఆధార్‌ను విజయవంతం చేయాలని కోరారు.

200 ఎకరాల్లో పట్టు సాగు

ప్రజాశక్తి - సీతంపేట

జిల్లాలో 200 ఎకరాల్లో పట్టు సాగవుతుందని సెరీకల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ సాల్మన్ రాజు అన్నారు. మంగళవారం పట్టు పరిశ్రమ రీలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 50 ఎకరాలు పట్టు సాగవుతుందన్నారు. 70 మంది రైతులు సాగు చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికే రైతుల వద్ద పట్టుగూళ్ల నాణ్యత బట్టి కిలో 500 నుండి 600 వరకు కొనుగోలు చేస్తామని తెలిపారు. రీలింగ్ కేంద్రంలోని పట్టుదారం తయారు చేస్తున్నామన్నారు. పట్టుగూళ్లు వేసే షెడ్లకు చిన్న షెడ్ అయితే రూ.3 లక్షలు, పెద్ద షెడ్డయితే రూ.4 లక్షల 50 వేలు ప్రభుత్వం ఇస్తుందని అన్నారు. వీటిలో ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం సబ్సిడీలో పట్టుగూళ్ల స్ట్రక్చర్లకు అందజేస్తున్నామని తెలిపారు. నెలకు 70 కిలోల వరకు పట్టు దారం తయారవుతుందని తెలిపారు. ఆయన వెంట సెరీకల్చర్ అధికారి ఊర్మిల ఉన్నారు



పట్టు పరిశ్రమ రీలింగ్‌కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎడి సాల్మన్‌రాజ్

వాడింది తక్కువ...వచ్చింది ఎక్కువ

విద్యుత్ ఛార్జీల భారంతో ప్రజలు బెంబేలు



అధిక మొత్తంలో వచ్చిన బిల్లు



ప్రజాశక్తి - పాలకొండ

విద్యుత్ వినియోగదారులకు తెలియకుండా బిల్లుల మోత మోగుతుంది. వాడిన విద్యుత్ తక్కువగా ఉన్నప్పటికీ విద్యుత్ బిల్లులు మాత్రం ఎక్కువగా వస్తున్నాయి. దీంతో విద్యుత్ వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. గత నెల బిల్లుకు, ఈనెల బిల్లుకు పోలిస్తే మోత మోగించారని చెప్పవచ్చు. గత ప్రభుత్వ హయాంలో తొమ్మిది సార్లు ప్రజలపై విద్యుత్ భారాలు పెంచగా, ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోనే విద్యుత్ బిల్లులు పెంచారు. మండలంలో 26,300 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. గత నెల ఈ కనెక్షన్ల ద్వారా రూ. 1,10,000 విద్యుత్ బిల్లు రాగా, ఈ నెల రూ.1,69,000కు పెరిగింది. ఇదిలా ఉండగా సామాన్యులకు ఇంటి బిల్లు సగానికి సగం పెరగడంతో లబోదిబోమంటున్నారు. పాలకొండకు ఆర్.పట్టాభి నాయుడు తన ఇంటి కరెంట్ బిల్లు గత నెల 83 యూనిట్లు వినియోగంచగా, రూ.325 రాగా, ఈనెల 67 యూనిట్లకే రూ.616 బిల్లు వచ్చింది. సర్‌ఛార్జీలు, ఎఫ్‌పిపిపిసిఎ తదితర ఛార్జీల పేరులతో వినియోగదారులకు తెలియకుండా బిల్లులు పెరగడంతో ఆందోళన వ్యక్తమవుతుంది. ఇదిలా ఉండగా చిరు వ్యాపారులకు కూడా బిల్లులు పెరగడంతో వారి జీవనోపాధికి గండికొట్టే పరిస్థితి నెలకొంది. ఇలా విద్యుత్ బిల్లులు పెరిగితే తమకు వచ్చే ఆదాయం షాపు అద్దెలకు, కరెంటు బిల్లులకే వస్తే ఇక తామెలా బతకాలంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కనీసం తమకు ఉపాధి కల్పించపోయినా, ఏదో దుకాణాలు పెట్టుకొని జీవనం సాగిస్తున్న తమపై ఇలా భారాలు మోపడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.

భారీగా పెరిగింది

గతనెలకు, ఈ నెలకు విద్యుత్ బిల్లు భారీగా పెరిగింది. గత నెల రూ.325 చెల్లించాను. ఈ నెల చలికాలం కావడంతో విద్యుత్‌ను పెద్దగా వినియోగించలేదు. అయినా రూ. 615 వచ్చింది. వేసవిలో వినియోగం ఎక్కువ ఉంటుంది. ఆ సమయంలో ఇంకెంత పెద్దమొత్తంలో బిల్లులు పెరుగుతాయోనని భయాందోళనగా ఉంది.



ఆర్. పట్టాభి నాయుడు,
వినియోగదారుడు, పాలకొండ

ఎరియర్స్ రూపంలో వడ్డన

మూడేళ్ల నుంచి పాలకొండలో అద్దెకు ఉంటున్నాను. కరెంట్ చార్జీలు గతంతో పోలిస్తే చాలా ఎక్కువ పెరిగాయి. గత నెల 112 యూనిట్లు విద్యుత్ వాడితే కరెంట్ బిల్ 474 రూపాయలు వచ్చింది. ఈనెల 76 యూనిట్లకు 802 రూపాయలు బిల్ వచ్చింది. 2024 ఏప్రిల్ తర్వాత ఏరియర్స్ రూపంలో అదనపు 473 రూపాయలు విధించారు.



ఎల్లుమహంతి చిట్టి పాత్రో, వినియోగదారుడు, పాలకొండ.


కోతాం పాఠశాలను పరిశీలించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కోతాం ప్రభుత్వ పాఠశాలను, అంగన్వాడీ కేంద్రాన్ని ఎంపిడిఒ కె.గీతాంజలి మంగళవారం సందర్శించారు. అంగన్వాడీ కేంద్రంలోని పిల్లల హాజరు, మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. పిల్లల ఆరోగ్యర శ్రద్ధ అవసరమని అంగన్వాడీలను ఆదేశించారు. అనంతరం పాఠశాల సందర్శనలో పిల్లల నైపుణ్యం, పఠనా సామర్థ్యాలు పరిశీలించారు.

తిటుకపాయి జిపిఎస్ పాఠశాల సందర్శన

మండలంలోని తిటుకపాయి జిపిఎస్ పాఠశాలను డిప్యూటీ డిఇఒ పాలక నారాయణ మంగళవారం సందర్శించారు. విద్యార్థులు సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులకు ఆటపాట లతో విద్యను బోధించాలన్నారు.



ధ్రువపత్రాలను అందుకుంటున్న డిస్ట్రిబ్యూటరీ చైర్మన్లు

ఏకగ్రీవంగా డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్లు

ప్రజాశక్తి - వీరఘట్టం

సర్దార్ గౌతు లచ్చన్న ప్రాజెక్టు పరిధిలోనే వీరఘట్టం పొదిలపు విజయ రమణి, తూడి బొత్స వెంకటనాయుడును మంగళవారం నీటి సంఘ అధ్యక్షులు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరఘట్టం ఉపాధ్యక్షులుగా చింత ఉమామహేశ్వరరావు, తూడి ఉపాధ్యక్షులుగా కండాపు హరిని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా సీతంపేట ఐటిడిఎ ఎపిఒ పి.మురళీధర్ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, మండల టిడిపి అధ్యక్షులు ఉదయాన ఉదయభాస్కర్, నీటి సంఘం మాజీ అధ్యక్షులు బల్ల హరిబాబు, ఎ.కృష్ణ, బి.నీలకంఠం నాయుడు, వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాలకొండ : ఎం.సింగుపురం పాఠశాలలో తోటపల్లి డిస్ట్రిబ్యూషన్ కమిటీ ఎన్నిక మంగళవారం జరిగింది. ఎం.సింగుపురం డిస్ట్రిబ్యూటరీ చైర్మన్‌గా చెబోదుల లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్‌గా రౌతు సోంబాబు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో నగరపంచాయితీ సమన్వయకర్త అన్నీ తానై వ్యవహరించారు. నూతన కమిటీని అభినందించారు. రైతుల సమస్యల పరిష్కారానికి ఈ కమిటీ పని చేస్తుందన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నీటి సంఘాల అధ్యక్షులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఇటీవల జరిగిన నీటి సంఘాల ఎన్నికల్లో గెలుపొందిన అధ్యక్ష, ఉపాధ్యక్షులు కురుపాం నియోజకవర్గ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని క్యాంపు కార్యాలయం వద్ద మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. చిత్తశుద్ధితో పనిచేసి రైతులకు ఉపయోగపడేలా కార్యక్రమాలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు పాడి సుదర్శన్ రావు, కార్యదర్శి పోలూరు శ్రీనివాసరావు ఉన్నారు.



ఎమ్మెల్యే జగదీశ్వరిని కలిసిన నీటి సంఘాల అధ్యక్షులు



నీటి సరఫరా లేక నిరుపయోగంగా ఉన్న పైపులైన్లు

చొక్కాపువానివలసలో దాహం కేకలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని ఎమ్మార్ నగరం పంచాయతీ పరిధిలోని చొక్కాపువానివలస, సంఘంవలస పంచాయతీ పరిధిలోని నిస్సంకువలసలో ఇంటింటా కుళాయిలు ఉన్నప్పటికీ గత తొమ్మిది నెలలుగా సరఫరా కాకపోవడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై సంబంధిత సచివాలయాల్లో తెలియపర్చినప్పటికీ ఎలాంటి చర్యల్లేవని, కనీస అవసరాలతో పాటు తాగు నీటికి తెగ ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని రక్షిత మంచినీటి పథకం ఉన్నప్పటికీ నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో తరచూ మరమ్మతులకు గురవుతుందని గ్రామస్తులు తెలిపారు. ఈ విషయమై గ్రామీణ నీటి సరఫరా అధికారులకు వివరణ కోరగా వాటర్ ట్యాంకుకు నీరు ఎక్కించడంలో తమ పని అని, స్థానికంగా ఉన్న పంచాయతీ కార్యాలయాలు, సచివాలయాల సిబ్బంది నీటి సరఫరాను నిర్దేశిత సమయంలో గ్రామానికి సరఫరా చేయాల్సిన బాధ్యత వారిదేనని, అయినా సమస్య తమ దృష్టికి తీసుకొచ్చినందున పరిశీలిస్తామని తెలిపారు. అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించి తమకు నీటి సరఫరా పునరుద్ధరణ చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు.

ఘనంగా పెన్షనర్ల దినోత్సవం

ప్రజాశక్తి - కురుపాం

జాతీయ పెన్షనర్స్ డే సందర్భంగా కురుపాంలోని విశ్రాంత ఉద్యోగులు ఘనంగా మంగళవారం విశ్రాంత ఉద్యోగుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉపఖజానాధికారి శంకరరావు, స్థానికసామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ శోభారాణి పాల్గొని ముందుగా క్రీశేషులు డిఎస్ నకర చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ జాతీయ పెన్షనర్స్ డే ప్రాముఖ్యతకు వచ్చి వివరించారు. అనంతరం విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు బి.పాండురంగ, సహచర అధ్యక్షులు జి.దాలినాయుడు, ప్రధాన కార్యదర్శి టివిఎస్ఎస్ సోమయాజులు, కోశాధికారి జె.రామకృష్ణారావు, కార్యవర్గ సభ్యులు విశ్రాంతి ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ శోభారాణి

పాలకొండ : రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం మంగళవారం చౌదరి నాయుడు అధ్యక్షతన స్థానిక కృష్ణ సాయి డిగ్రీ కళాశాల ఆవరణలో జరిగింది. ఈ సమావేశంలో 80 ఏళ్లు నిండిన ఆరుగురు సూపర్ సిటిజన్స్‌కు, అలానే 79 ఏళ్ళ పింఛను దార్లను సన్మానించారు. ఈ సందర్భంగా చౌదరినాయుడు మాట్లాడారు. 2024 సంవత్సరానికి గానూ జనవరి, జూలై డిఆర్‌లు ఆమోదించాలని, 11వ పిఆర్‌సి బకాయిలు చెల్లించాలని, 12వ పిఆర్‌సి కమిషన్‌ను నియమించాలని, ఐఆర్‌ను తక్షణం ప్రకటించాలని కోరారు. వీటితో పాటు కమ్యూటెడ్ వాల్యూ పెన్షన్ గూర్చి రాష్ట్ర హైకోర్టు పెన్షన్ తాత్కాలిక ఉత్తర్వులను ఆమోదించాలని, నగదురహిత వైద్య సదుపాయం అన్ని ఆసుపత్రుల్లో కల్పించాలని, రిటైరైన పింఛనుదారుకు రావాల్సిన బకాయిలు వెంటనే ఇవ్వాలని, ప్రస్తుతం ఆదాయ పన్ను శ్లాబ్‌ను సవరిస్తూ వాటిపై విధిస్తున్న సెస్‌ను ఉపసంహరించాలని, బ్యాంకు డిపాజిట్లపై వచ్చే వడ్డీ మీద ఆదాయ పన్ను విధించకూడదని కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తూ తీర్మానించారు. పింఛనుదారులంతా తమ లైఫ్ సర్టిఫికెట్లు 2025 జనవరి 1 నుంచి 28 లోపు సమర్పించాలని సంఘ అధ్యక్షులు నాయుడు సూచించారు.



శిక్షణలో మాట్లాడుతున్న సిడిపిఒ రాణి

కిశోరి వికాసం.. బంగారు భవిష్యత్తుకు పునాది

ప్రజాశక్తి - కొమరాడ

కిశోర వికాసం కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని, ఉజ్వల, ఆరోగ్యకరమైన, సాధికారిత దిశగా ఆమె వేసే అడుగుకు సమిష్టి కృషితో చేయూతనిద్దామని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి ఎంఎన్ రాణి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఐసిడిఎస్ పిఒ జి.సుగుణకుమారి అధ్యక్షతన కిశోర వికాసం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ 11 నుంచి 18 ఏళ్ల బాలికలు చదువుపై దృష్టి పెట్టేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. 18 ఏళ్ల నిండకుండా పెళ్లి చేసుకోకూడదని చెప్పారు. 18ఏళ్లలోపు వివాహాలు చేస్తే పోలీస్ స్టేషన్ గానీ, ఐసిడిఎస్ అధికారులకు గానీ సమాచారం అందించాలని సూచించారు. ప్రతి బాలిక తన పూర్తి సామర్థ్యాన్ని తెలుసుకోగలిగేలా సమగ్రాభివృద్ధి సాంతం చేసుకునేలా ఈ కార్యక్రమం ద్వారా చేయూతనివ్వనున్నట్లు వివరించారు. ఇందుకు ప్రతి గ్రామంలో బాలికల సంఘాలను ఏర్పాటు చేసి అవగాహన కల్పించడంతో పాటు, సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకునేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. బాలికల్లో ఆత్మరక్షణ శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం, డిజిటల్ భద్రత, సైబర్‌క్రైమ్, ఆన్‌లైన్ వేదికలపై జాగ్రత్తగా వుండేలా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. బాలికలు అన్ని విధాలా ఎదగడానికి ఉన్న అడ్డంకులను తొలగించడంలో పటిష్ట భాగస్వామ్యం ఉండాలన్నారు. డ్రాపౌట్స్ తిరిగి చదువుకొనేలా ప్రోత్సహించడం, నైపుణ్యాభివృద్ధి, వృత్తి విద్య, ఉపాధి అవకాశాలు పెంచడం, రక్తహీనతను నివారించడం, బాల్య వివాహాలను అడ్డుకోవడం, యోగా, శారీరక వ్యాయామాన్ని ప్రోత్సహించడం తదితరాలపై వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మల్లికార్జున రావు, డిసిపిఒ ఎ.సత్యనారాయణ, ఎస్ఐ నీలకంఠరావు, పిహెచ్‌సి వైద్యాధికార శిరీష, ఎంఇఒ చిన తిరుపతిరావు, మండల స్థాయిలో స్కూల్ టీచర్లు, మహిళా పోలీసులు, ఎఎన్ఎంలో, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిసిపిఒ సిబ్బంది, అంగన్వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధిపై దృష్టి పెట్టాలి : ఎంపిపి

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రణాళికలు వేసుకుని గ్రామాలు అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, అధికారులు, సచివాలయ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన శిక్షణ తరగతిలో మాట్లాడారు. గ్రామాలు అభివృద్ధి జరిగేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బి.వెంకటరమణ, ఎఒ డి.వెంకటరమణ, పంచాయతీరాజ్ జెఇ డి.కళ్యాణదుర్గ, ఎపిఎం కె.రాము, ఎపిఒ జి.సత్యంనాయుడు, హౌసింగ్ ఎఇ వి.వినోద్ కుమార్, సర్పంచులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట : పంచాయతీలను ప్రగతి పథంలో నడిపించాలని రిసోర్స్‌పర్సన్, ఇఒపిఆర్‌డి కొండపల్లి సత్యం అన్నారు. మంగళవారం స్థానిక వైటిసిలో రెండో రోజు సర్పంచులకు, కార్యదర్శిలకు, సచివాల సిబ్బందికి పంచాయతీ అభివృద్ధిపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన పంచాయతీ విధి విధానాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు నిర్మూలించాలన్నారు. పంచాయతీలు అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి శ్రీదేవి, హెచ్ఒ జయశ్రీ, కార్యదర్శులు పాల్గొన్నారు.



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న తహశీల్దార్ ఉమామహేశ్వర్

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదం

ప్రజాశక్తి - సీతానగరం


రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించుకొనేందుకు రెవెన్యూ సదస్సులు ఎంతో ఉపయోగపడతాయని డిప్యూటీ తహశీల్దార్ వి.ఉమామహేశ్వర్ అన్నారు. మండలంలోని కామన్నదొరవలసలో మంగళవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉండే దీర్ఘకాలిక భూ సమస్యలను ఈ సదస్సులో దరఖాస్తులు అందజేస్తే వాటికి పరిష్కరించడం జరుగుతుందన్నారు. భూ క్రయవిక్రయాలు ఒకరి పేరున ఒకరు మార్పించేందుకు భూ రిజిస్ట్రేషన్లు ఉంటే సమస్యలను దరఖాస్తు రూపంలో తెలియజేసుకోవచ్చన్నారు. ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నెలరోజుల పాటు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బి.గోపాలకృష్ణ, బి.గౌరునాయుడు, బి.ముకుందరావు, బి.మోహన్‌రావు, బి.శ్రీనివాసరావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

సీతంపేట : గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కరించడానికి రెవెన్యూ సదస్సులు ప్రభుత్వం నిర్వహిస్తుందని స్థానిక తహశీల్దార్ పి.అప్పలరాజు అన్నారు. మండలంలోని సామరెల్లి పంచాయతీలో సామరెల్లి, గెద్దకోల, సిది గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ పెద్దపూడి అప్పలరాజు మాట్లాడుతూ 45 రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అధికంగా ముటేషన్లు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో విఆర్ఒ, సర్పంచ్ కూరంగి సింగం, వైస్ సర్పంచ్ మీనక హరిబాబు, వార్డుసభ్యులు పాలక శంకర్రావు, బిడ్డిక గంధర్వులు, తదితరులు పాల్గొన్నారు.

గుమడ రైల్వే స్టేషన్ రోడ్డు మరమ్మతులు చేయాలి

ప్రజాశక్తి - కొమరాడ

మండల కేంద్రానికి సమీపంలో గల గుమడ రైల్వే స్టేషన్‌కు వెళ్లే రహదారి మరమ్మతు పనులు వెంటనే చేపట్టి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం గోతులైన రహదారిని పరిశీలించి మాట్లాడారు. ఈ రహదారి మార్గంలో కొమరాడ మండలానికి సంబంధించిన అనేకమంది రైల్వే ప్రయాణికులు వస్తూపోతూ ఉంటారని అన్నారు. ఇలాంటి సందర్భంలో ఈ రహదారి గతంలో తారు రోడ్డు వేసి బాగా ఉన్న సందర్భంలో రాయగడ నుండి విజయనగరం వరకు మూడో రైల్వే లైన్ వేసిన సందర్భంగా రైల్వే కాంట్రాక్టు తమ సామగ్రి పెద్దపెద్ద వాహనాల ద్వారా గుమడ రైల్వే స్టేషన్‌కు రవాణా చేసే సమయంలో పూర్తిగా ఈ రహదారి మార్గంలో పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో ఇప్పటికే ప్రయాణికులు ఆ గోతుల్లో పడి క్షతగాత్రులవుతున్నారన్నారు. ఈ విషయమై గతంలో అనేకసార్లు రైల్వే అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేని పరిస్థితి ఉందని అన్నారు. కావున వెంటనే రైల్వే కాంట్రాక్ట్‌ను రప్పించి ఈ మార్గంలో ఉన్న గోతులను పూడ్చివేయాలని, లేనిచో ప్రయాణికులతో కలిసి గుమడ రైల్వే స్టేషన్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రయాణికులు పాల్గొన్నారు.



శిక్షణలో పాల్గొన్న ఎంపిడిఒ త్రివిక్రమరావు, సిబ్బంది

ముగిసిన శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయం కార్యదర్శులు, ఎఎన్ఎంలు, మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు 2025-26 మూడో బ్యాచ్ శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిశాయి. ఈ మేరకు ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రాధాన్యత ప్రకారం అభివృద్ధి పనులు నిర్వహించాలన్నారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరా తదితర మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ప్రజల భాగస్వామి అవసరం ఎంతైనా ఉందన్నారు. పంచాయతీల అభివృద్ధికి ప్రజాప్రతినిధుల సహకారంతో, వివిధ శాఖల సిబ్బంది అభివృద్ధి పనులు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఒటిలు బి.మనోహర్, ఎ.శశిభూషణ రావు, పీటర్ పాల్, కె.శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి

ప్రజాశక్తి - కొమరాడ

ప్రతి యువతీ యువకులు రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తూ రోడ్డు భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలని రోడ్డు రవాణా శాఖ ఇన్‌స్పెక్టర్ జి.సత్యం నారాయణ అన్నారు. మంగళవారం మండలంలోని అర్తం, స్వామినాయుడువలస, కోటిపాం, కొమరాడలోని పలు అంతరాష్ట్ర రహదారిపై ప్రజలకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించుకొని ప్రభుత్వ నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పకుండా పాటించాలన్నారు. ముఖ్యంగా మైనర్లు వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున లైసెన్స్ లేకుండా వాహనాలు నడపకూడదని సూచించారు. మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమైతే వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని,అన్నారు. ద్విచక్ర వాహన దారులు తప్పకుండా హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలన్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ శాఖ సిబ్బంది ప్రజలు ఉన్నారు.

విద్యార్థుల మరణాలకు ప్రభుత్వం బాధ్యత వహించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మన్యం ప్రాంతాల్లో ఇటీవల గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షులు పల్ల సురేష్ అన్నారు. ఈ ఏడాది దాదాపు 14 వరకు విద్యార్థులు అనారోగ్యంతో మృతి చెందారని తెలిపారు. గిరిజన విద్యార్థి మరణాలను ప్రభుత్వం అరికట్టేలా చర్యలు తీసుకొనే ప్రయత్నాలు చేయడం లేదని, మొదటి సంతకమని మంత్రి చెబుతూ ఇప్పటి వరకు ఆశ్రమ పాఠశాలల్లో పనిచేసిన ఆదివాసీ ఆరోగ్య సిబ్బందినైనా వేయడం లేదని పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరం చివరి దశలో వచ్చినా సరే ఇంతవరకు విద్యార్థులు మరణాలు కొనసాగుతూనే ఉన్నాయన్నారు. ఒకవైపు ఆశ్రమాల్లో గురుకులాల్లో ఉపాధ్యాయుల్లేక విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యార్థుల మరణాల అదుపు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలి

అనారోగ్యంతో మృతి చెందిన పత్తిక దినేష్ కుటుంబానికి రూ.10లక్షలు ఆర్థిక సాయం అందించాలని ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రోబ్బ లోవరాజు కోరారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కూడా కల్పించాలని కోరారు. వరుస విద్యార్థుల మరణాలు జరుగుతున్నాయని, వీటి నివారణకు ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని జిల్లా అధ్యక్షులు ఇంటికుప్పల రామకృష్ణారావు, గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షులు ఆరిక చంద్రశేఖర్, ఆదివాసీ జెఎసి జాయింట్ సెక్రెటరీ దుక్క సీతారాం, బాలకృష్ణ కోరారు.

పక్కాగా ఆరోగ్య సర్వే చేపట్టాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

అనారోగ్య సమస్యలు ముందస్తుగా గుర్తించే లక్ష్యంగా ఆరోగ్య సర్వేలు పక్కాగా, పారదర్శకంగా నిర్వహించాలని వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని బాలగుడబ, కృష్ణపల్లిలో హెల్త్, వెల్నెస్, అంగన్వాడీ కేంద్రాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఎన్‌సిడి, స్కూల్ హెల్త్, అంగన్వాడీ హెల్త్ స్క్రీనింగ్, సర్వేలు ఏమేరకు చేపడుతున్నారో రికార్డులు, ఆన్లైన్‌లో నమోదు తీరు పరిశీలించారు. 18 ఏళ్ల పైబడిన వారికి నిర్వహిస్తున్న ఎన్‌సిడి సర్వే ద్వారా కొత్తగా దీర్ఘకాలిక రోగ లక్షణాలు, క్షయ, లెప్రసీ ఇతర ఆరోగ్య సమస్యల సర్వే వివరాలపై ఆరా తీశారు. కేన్సర్‌ను ముందస్తుగా గుర్తించడం ఆవశ్యకమని నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ స్క్రీనింగ్స్ ఎంత మందికి చేపట్టారని అడిగి తెలుసుకున్నారు. స్కూల్ హెల్త్ స్క్రీనింగ్ ద్వారా విద్యార్థుల్లో ఏవైనా ఆరోగ్య సమస్యలు గుర్తించారా అని రికార్డులు పరిశీలించారు. హెల్త్ వెల్నెస్ కేంద్రంలో ప్రతి రోజూ ఎంత మందికి ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారో ఒపి రికార్డుల్లో పరిశీలించారు. రోగుల ఆరోగ్య సమస్యలు స్పష్టంగా తెలుసుకోవాలని సూచించారు. ఇ- సంజీవిని కాల్స్ వివరాలను అంతర్జాలంలో పరిశీలించారు. వైద్య పరికరాల పనితీరు పరిశీలించారు. మందుల లభ్యత, కాలపరిమితి తనిఖీ చేశారు. కేంద్రం పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. వైద్యారోగ్య శాఖ అందజేస్తున్న పోస్టర్లను గ్రామాల్లో పలు ప్రదేశాల్లో ప్రదర్శించాలని, కర పత్రికలను ప్రజలకు అందజేసి ఆరోగ్య అవగాహన కల్పించాలన్నారు. అనంతరం డాక్టర్ జగన్మోహన్ అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల ఆరోగ్య స్థితి పరిశీలించారు. పిల్లల్లో న్యుమోనియా, ఇతర శ్వాస సంబంధిత లక్షణాలు గుర్తించడంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ డెమో యోగీశ్వరరెడ్డి, ఎపెడిమిక్ ఇఒ సత్తిబాబు, వైద్య సిబ్బంది జగన్నాదరావు, శిరీష, రామలక్ష్మి, అంగన్వాడీ సిబ్బంది జయలక్ష్మి, రాజేశ్వరి, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని రావివలస, కారివలసలో ప్రకృతి వ్యవసాయం సాగుపై రైతులకు అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ డైరెక్టర్ కె.రాబర్ట్ పాల్ ప్రకృతి వ్యవసాయానికి, రసాయనిక వ్యవసాయానికి ఉన్న వ్యత్యాసాలను చర్చించారు. నవధాన్యాల సాగువల్ల పొందు లాభాలను చర్చించారు. ఇందులో భాగంగా భూసారవంతానికి పలు సూచనలు చేశారు. ఏడాది పొడవునా భూమిని పలు పంటలతో కప్పి ఉంచడం వల్ల, పంట దిగుబడిలు బాగా వస్తున్నాయని, జిల్లాలోని అన్ని మండలాల్లో, గ్రామాలు రైతులతో ఈ రబీ సీజన్లో అపరాలైన పెసలు, మినువులు, ఉలలు, కొమ్ము శెనగ, వేరుశెనగ వేసుకోవడం వల్ల అదనపు ఆదాయంతో పాటు, భూమిని సారవంతం చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ మేనేజర్ పి.షణ్ముఖ రాజు రైతులు ఖర్చులు తగ్గించుకొని దిగుబడులు పెంచేలా నూతన పద్ధతులు ఆచరించాల్సిన అవసరం ఆసన్నమైందన్నారు. కర్రివలస రైతు ఎం.విజయంకుశం తాను ప్రతి ఏటా పూర్తి స్థాయిలో పంటలు పండించడం చూసి మిగతా రైతులు కూడా ఇలాగే పండించుకోవడానికి ముందుకు రావడం జరుగుతుందని, అందుకు సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఎఒ విజయ భారతి, ఎన్ఎఫ్ఎ జి.అన్న పూర్ణ, వి.పోలినాయుడు, రైతులు శ్రీనివాసరావు, కె.వెంకటనాయుడు, బి.సింహాచలం పాల్గొన్నారు.



హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న జిల్లా ప్రజారవాణాధికారి శశికుమార్

హెల్మెట్ వాడకం తప్పనిసరి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జిల్లాలో జరుగుతున్న ద్విచక్ర వాహన రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వాడకంపై రహదారి భద్రత అవగాహనా కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక ప్రజా రవాణా శాఖ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణాధికారి ఎం. శశికుమార్ మాట్లాడుతూ మైనార్టీ తీరకుండానే తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలిస్తున్నారని, వారు కనీసం హెల్మెట్ పెట్టుకోకుండా అతివేగంగా బైకు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నా యని అన్నారు. జిల్లాలో జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో వుంచుకొని డ్రైవింగ్ లైసెన్స్ లేని పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని తెలిపారు. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో అపరాధ రుసుంతో పాటు మూడు నెలలు లైసెన్స్ రద్దు చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సహాయ ప్రజా రవాణాధికారి, జి.సత్యనారాయణ, ఎన్.రమేష్‌కుమార్, ఎ.వరప్రసాద్, బి.కాశీరామ్‌నాయక్, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గులిరాగి సాగుతో అధిక ఆదాయం

ప్రజాశక్తి - పాచిపెంట

గుళి పద్ధతిలో నాటిన చోడి పంట దిగుబడి సాధారణ చోడి పంట కంటే రెట్టింపు వస్తుందని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో క్షేత్ర సందర్శనలో భాగంగా మండలంలోని కేశలిలో రైతు మీసాల మోహన్ రావు ఎకరా చోడి పంట నాటడం కోసం గుళి పద్ధతిలో నారుపోతను పరిశీలించారు. అనంతరం ఎఒ మాట్లాడుతూ గుళి పద్ధతిలో నాటుకున్నట్లయితే ఎకరాకు 20 క్వింటాళ్లకు పైగా దిగుబడి వస్తుందని, విత్తన మోతాదు ఎకరానికి 750 గ్రాములు సరిపోతుందని తెలిపారు. ఈ పద్ధతిలో ఎత్తైన మెత్తటి నారుమడి తయారు చేసుకుని విత్తనాలు చల్లుకుని భూమిలో కలిపి దానిపై ఘనజీవామృతం గానీ, బాగా చివికెన పశువుల గెత్తం కానీ చల్లుకుని సరైనంత తేమ కోసం నీటిని అందించాలని సూచించారు. 12 నుంచి 15 రోజుల వ్యవధిలో ప్రధాన పొలాన్ని తయారు చేసుకుని అడుగున్నర దూరంలో వరుసల్లో ఒక్కొక్క మొన నాటుకోవాలని తెలిపారు. గత ఏడాది సుమారు ఎకరాకు 14 క్వింటాల దిగుబడి వచ్చిందని, ఈ ఏడాది ఆరుగురు రైతులు గులి పద్ధతిలో చోడి పంట పండించడం కోసం సిద్ధంగా ఉన్నారని రైతు మోహనరావు తెలిపారు అనంతరం మొక్కజొన్న పంటను పరిశీలించారు. కార్యక్రమంలో విఎఎ రాకేష్ కుమార్, ప్రకృతి సేద్య సీఆర్పీలు సురేష్, విజయ్, రైతులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి - సీతానగరం

సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తతో ఉండాలని ఎఎస్ఐ లంక శ్రీను వాసరావు అన్నారు. సంకల్పంలో భాగంగా మండలంలోని మరిపివలస, చినభోగిల జంక్షన్‌లో సైబర్ నేరాలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడుతూ మీకు తెలియని వ్యక్తుల నుంచి లింకులు పంపిస్తే ఓపెన్ చేయవద్దని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మానవ తప్పిదాల వల్లే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఆన్లైన్ మోసాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్‌క్రైమ్, ఆన్లైన్ మోసాలపై క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ జయలక్ష్మి,పద్మ గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదువుకోవాలని స్థానిక సర్పంచ్ బొత్తా గౌరీశంకరరావు అన్నారు. గుమ్మలక్ష్మీపురంలోని గడ్డికాలనీలో ఎంపిపి పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని సర్పంచ్ మంగళవారం సందర్శించారు. కాసేపు విద్యార్థులతో మాట్లాడారు. విద్యకు ప్రభుత్వం అధిక ప్రాథమిక ఇస్తుందని, ప్రతిరోజు పాఠశాలకు రావాలని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డబ్ల్యుఎస్ ఎఇ ప్రవీణ్ కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

పెట్టుబడులు తక్కువ - ఆదాయం ఎక్కువ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రకృతి వ్యవసాయం సాగుతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చునని జీవ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ప్రబోధ్ అన్నారు. మండలంలోని రాయగడ జమ్ములో పువ్వుల రామారావు పొలంలో మంగళవారం పంట కోత ప్రయోగం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నవ ధాన్యాలు వేసి శ్రీ పద్ధతిలో వరి నాట్లు వేసుకోవడం, ప్రకృతి వ్యవసాయంలోని అన్ని పద్ధతులు పాటించడం వల్ల ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు పండించడానికి వీలుంటుందన్నారు. వినియోగదారులకు - ఉత్పత్తిదారులకు మంచి ప్రయోజనం కలుగుతుందని అన్నారు. 5x5 పంట కోత ప్రయోగంలో తడి బరువు 15.59 గ్రాములు రావడం జరిగినదని, ఎకరాకు 2273 కేజీలు వస్తుందని తెలిపారు. మండలంలోని 12 గ్రామాల్లోని 150 మంది రైతుల ఆదాయ - వ్యయాలు పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుందని అన్నారు. రాబోయే తరాలకు మనం సారవంతం భూమి, ఆరోగ్యకరమైన వాతావరణ లభించే ఉద్దేశంగా పనిచేయడం జరుగుతుందన్నారు. నాబార్డ్ ఆర్థిక సహకారంతో, జట్టు సంస్థ పర్యవేక్షణ, మా తోటలోనే అంతర పంటలు, ఎర పంటలు, సరిహద్దు పంటలు, దంపజాతులు , తీగ జాతులు, మొదలగు పంటలు వేసుకోవాలని, జీడి తోటల్లో అంతర పంటలైన పసుపు, అల్లం, పైనాపిల్, కర్రపెండలం, మొదలగు పంటల పండించుకొని రైతులు ఆర్థిక అభివృద్ధి సాధించడంతో పాటు, మానవ ఆయువు జీవన ప్రమాణం రేటు పెంచే దిశగా అడుగులు ముందుకు వేయడం జరుగుతుందని అన్నారు. అందుకు ప్రతి రైతు, ప్రతి కార్యకర్త, అకుంఠిత భావంతో పనిచేయాలన్నారు. పాఠశాల ప్రాంగణం, ఖాళీ ప్రదేశాల్లో అన్ని రకాల ఆకు, కూరగాయలు పండించుకోవడం వల్ల మధ్యాహ్నం భోజనం పథకంలో వినియోగించుకోవడం వల్ల ఆరోగ్యంతో పాటు, పిల్లలకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు పని అనుభవం ద్వారా పంటలు పండించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కోర్డినేటర్ జి.మురళీ మోహన్,రైతులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు



ప్రమాదంలో గాయపడ్డ కైలాష్

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - కురుపాం

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన కురుపాం మండల కేంద్రానికి సమీపంలో గల జోగిరాజుపేట దగ్గర మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు అందించిన వివరాల ప్రకారం...

నిమ్మక కైలాష్ (27) కురుపాం నుంచి కిచ్చాడ వెళ్తుండగా కన్నప్పదొరవలసకు చెందిన బంగారి నాగార్జున (33) కిచ్చాడ నుంచి కన్నపుదొరవలస వస్తున్నాడు. ఎదురెదురుగా వస్తున్న ఈ రెండు బైకులు జోగిరాజుపేట వద్ద ఢీకొన్నాయి. ఈ సంఘటనలో వీరిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వీరిని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం పార్వతీపురం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారని అన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

ప్రజాశక్తి - సీతంపేట

చిన్నబగ్గ పరిసర ప్రాంతాల్లో 300 లీటర్లు బెల్లం ఊటలను ధ్వంసం చేసినట్లు ఎస్సై వై.అమ్మనరావు తెలిపారు. సారా నిర్మూలనకు ప్రజలు సహకరించాలన్నారు. సారా రవాణా చేసిన తయారుచేసిన కేసులు తప్పవని హెచ్చరించారు. సారా తయారీ కేంద్రాలపై దాడులు చేస్తామన్నారు. సారా నేలమట్టం చేసి డ్రమ్ములు స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌సి గురుమూర్తి తదితరులు ఉన్నారు.